క్లుప్తంగా

నేడు మిలాద్-ఉన్-నబి

విజయపురం: మిలాద్-ఉన్-నబి పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇస్లాం మతాన్ని స్థాపించిన చివరి ప్రవక్త ముహమ్మద్ పుట్టినరోజునే ఈద్ మిలాద్-ఉన్-నబీ పండుగగా నిర్వహిస్తారు. ఈ పండుగను మవ్లీద్ అని కూడా పిలుస్తారు. మవ్లీద్ అంటే అరబిక్‌లో పుట్టుక అని అర్థం. అలాగే అరబిక్‌లో నబీ అనే పదానికి ప్రవక్త అని అర్థం. మొత్తంగా ఈద్ మిలాద్-ఉన్-నబీ అంటే ప్రవక్త పుట్టిన పండుగ అని అర్థం. మహమ్మద్ ప్రవక్త దేవుని నుంచి వచ్చిన దూత అని ముస్లింలు నమ్ముతారు. దయ, ధర్మబద్ధమైన జీవితాలను ఎలా జీవించాలో ప్రజలకు చూపించడానికే ముహమ్మద్‌ను అల్లాహ్ పుట్టించాడని విశ్వసిస్తారు. ఆయన పుట్టుకను ఈ రోజు రాత్రి మసీదులో ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తారు.

పూర్తయిన రోడ్డు నిర్మాణం



రోడ్డు పనుల వద్ద నిర్వాహకులు గుణశేఖర్‌రెడ్డి, రూప శేఖర్ రెడ్డి

గంగాధర నెల్లూరు: పెడకంటిపల్లి వయా మండల సరిహద్దు పెనుమూరు రోడ్డు వరకు ప్రధాన మంత్రి గ్రామీణ రోడ్డు యోజన పథకం కింద చేపట్టిన పనులు ఆదివారంతో పూర్తయ్యాయి. గత ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రత్యేక చొరవతో మంజూరు చేసుకున్న ఈ పనులు నిర్ణీత గడువు సంవత్సరంలోపు కంటే ముందే దాదాపు నాలుగు కోట్ల రూపాయలతో 7.6 కిలోమీటర్ల దూరాన్ని అతి తక్కువ రోజుల్లోనే కాంట్రాక్టర్లు నిర్మించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు ద్వారా దాదాపు 30 గ్రామాలకు సులభతరంగా ప్రయాణం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పనుల నిర్వాహకులు గుణశేఖర్‌రెడ్డి, రూప శేఖర్ రెడ్డి, లక్ష్మీకరరెడ్డిలకు చుట్టుపక్కల గ్రామస్తులు స్థానికులు అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు.

వైభవంగా ప్రదోష పూజలు



నంది వాహనంపై కామాక్షీ సమేత కరకంఠేశ్వరుడు

నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వరాలయంలో ప్రదోష పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో అలంకరించి నంది వాహనంపై ఉంచి ఆలయ ప్రదక్షిణం చేశారు. అనంతరం వాహన మండపం వద్ద భక్తుల దర్శనార్థం వేంచేపు చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వెదురు కుప్పంలో..



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా ప్రదోష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడు, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశ్వరనికి దూపదీప నైవేద్యాలు సమర్పించారు.ఆలయ ప్రదాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూకలు నిర్వహించారు.ఆదివారం సాయంత్రం సందీశ్వరుడుకి ప్రత్యేకంగా అలంకరించి పాలూ,పెరుగు,కుంకుమ,పసుపుతో అభిషేకం నిర్వహించారు.ప్రదోశ పూజలు అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి,తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రేపటి నుంచి కాణిపాకంలో ప్రత్యేక ఉత్సవాలు

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం వరసిద్ధ వినాయకస్వామి నవరాత్రి ఉత్సవాలు సోమవారం రాత్రి ధ్వజావరోహణంతో ముగియనున్నాయి. మంగళవారం ఉదయం నుంచి స్వామివారి నుంచి ప్రత్యేక ఉత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించనున్నారు. ఈ నెల 17 నుంచి 27వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయకస్వామి పలు వాహనాల్లో అధిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

అద్భుతం.. కళాకారుల నృత్యం



ఐరాల/తవణంపల్లె: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్థాన మండపంలో కళాకారుల భరతనాట్య ప్రదర్శనలు రంజింపజేశాయి. నాటక ప్రదర్శనలు, భక్తిగీతాల కచేరి అలరించాయి. కళాకారులను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సత్కరించారు.

మా పేదల కలలు కల్లలేనా?



నా కుమార్తెను డాక్టర్‌గా చూడాలన్నది నా జీవితాశయం. ప్రస్తుతం నా కుమార్తె ప్రభుత్వ కళాశాలలో బైపీసీ సెకండియర్ చదువుతోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నా కుమార్తె ఎంబీబీఎస్ పట్టా తీసుకోవాలని ఎదురు చూస్తున్నాం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయడంతో నా కుమార్తె తప్పక డాక్టర్ అవుతుందని సంతోషించా. నేటి టీడీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే మా పేదల కలలు కలలుగానే మిగిలిపోవాల్సిందేనా?

– టి.సుబ్రమణ్యం, పుత్తూరు



విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు



ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడడం మంచిది కాదు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల రద్దు నిర్ణయం విద్యాభివృద్ధికి తీరని అవరోధం. ప్రభుత్వం అంటే కళాశాలలను స్థాపించి ఉచితంగా విద్యను అందించాలి. అలా కాకుండా ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలను సైతం ప్రైవేట్ పరం చేస్తే మాలాంటి పేదలు మా బిడ్డలను ఎలా చదివించుకోవాలి. నా కుమార్తెను డాక్టర్‌ను చేయాలని బైపీసీ చదివిస్తున్నా. ప్రస్తుత ప్రభుత్వం తీరుతో మాలాంటి వాళ్ల ఆశలు అడియాశలుగా మిగులుతున్నాయి.

– సావిత్రి, పుత్తూరు.

ఆర్‌ఎంపీల మెడికల్ దందా

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆర్‌ఎంపీ డాక్టర్లు
- నూది వేయడం తెలిస్తే చాలు... క్లినిక్ పెట్టేస్తున్నారు



పన్నూరులో ఆర్‌ఎంపీ క్లినిక్‌లో వైద్య సిబ్బంది తనిఖీ

విజయపురం: చిత్తూరు జిల్లా, విజయపురం మండలం, పన్నూరు సబ్‌స్టేషన్ గ్రామంలో ఆర్‌ఎంపీ బోర్డుతో కొందరు ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారు. సుమారు 25యేళ్ల క్రితం ఓ ఏఎన్ఎం ఆర్‌ఎంపీ సర్టిఫికేట్ పేరు ఓ బోర్డు ఏర్పాటు చేసి చికిత్స ప్రారంభించింది. ఆ తరువాత చేపకింద నీరులా మరి కొంత మంది ఇక్కడికి వచ్చి ఆర్‌ఎంపీ బోర్డుతో వైద్య అందిస్తున్నారు. ఇలా ప్రస్తుతం ఇప్పుడు సుమారు పదికి పైగా ఆర్‌ఎంపీ బోర్డుతో వైద్య అందిస్తున్నారు.

వచ్చీరాని వైద్యం...

ప్రాథమిక చికిత్స చేయాల్సిన వారు రోజుల తరబడి వచ్చీరాని వైద్యం చేస్తున్నారు. రోగి ప్రాణాలకే ప్రమాదం వచ్చేలా వ్యవహరిస్తున్నారు. రోగులకు అధిక మోతాదులో సూదులు వేస్తున్నారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. అవగాహన లేక, ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితుల్లో చాలా మంది ఆర్‌ఎంపీల వద్దే వైద్యం చేసుకుంటున్నారు. ఇదే అదనుగా భావించి కొందరు ఆర్‌ఎంపీలు డబ్బుల కోసం కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అంతే కాకుండా పేషెంట్లను ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేస్తే కమీషన్ తీసుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన ఆర్‌ఎంపీలు.. డాక్టర్ల అవతారమెత్తి వచ్చీరాని వైద్యం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే జిల్లా అధికారులు ఏం చేస్తున్నారని వివిధ సంఘాల నాయకులు దుమ్మెత్తిపోస్తున్నారు. చిన్న గాయమైతే కట్లు కట్టడం, జ్వరం వస్తే పారాసిట్మాల్ టాబ్లెట్ ఇవ్వడం వరకే ఆర్‌ఎంపీలు పరిమితం కావాలి. కానీ స్టెత్ మెడలో వేసుకుని రోగులను పరీక్షిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సర్జరీలు కూడా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోట్లకు పడగలెత్తుతున్న ఆర్‌ఎంపీలు

ఆర్‌ఎంపీ బోర్డు పెట్టుకొని వచ్చీరాని వైద్యం చేసి కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇవయ్యేళ్లకు ముందు ఓ మహిళ ఏఎన్ఎం చదివి పన్నూరు సబ్‌స్టేషన్‌లో తన ఇంటిలో మాత్రలు, సూదులు వేయడం ప్రారంభించింది. రోగులు అధికంగా రావడంతో ఇంటిని క్లినిక్‌గా మార్చేసింది. ఆ తరువాత మెల్లగా మెడికల్ షాపు పెట్టేసింది. ప్రస్తుతం ఓ ఎంబీబీఎస్ డాక్టర్ చేస్తున్న పనులన్నీ చేస్తూ ఓ ప్రైవేటు ఆసుపత్రిగా మార్చేసి కోట్లల ఆస్తి సంపాదించేసింది. జిల్లా ఉన్నాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలి

ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలనే నిబంధనలున్నాయి. రోగి సమస్య పెద్దదిగా ఉంటే అందుబాటులో ఉన్న పెద్ద హాస్పిటల్‌కు రిఫర్ చేయాలి. కానీ రూల్స్ పక్కన పెట్టి ప్రిస్క్రిప్షన్ ప్యాడ్స్ ముందు పెట్టుకుని మందులు, ల్యాబ్ టెస్ట్, స్కానింగ్ రాస్తున్నారు. అంతటితో ఆగకుండా వారి రూమ్స్ బెడ్స్ వేసి, ఫ్లూయిడ్స్ పెట్టడం, యాంటీ బయాటిక్ ఇంజెక్షన్లు ఇవ్వడం లాంటివి చేస్తున్నారు. రోగి పరిస్థితిని బట్టి ఫ్లూయిడ్స్ అవసరమా లేదా అని ఆలోచించి ఇవ్వాలి. కానీ వీరు ఏమీ పట్టించుకోకుండా వచ్చిన ప్రతి ఒక్కరికీ ఫ్లూయిడ్స్ ఎక్కించి నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

ఎంబీబీఎస్ డాక్టర్లే ఆలోచిస్తుంటే...

రోగికి యాంటీ బయాటిక్స్ ఇవ్వడానికి ఎంబీబీఎస్ డాక్టర్లే ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. కానీ ఆర్‌ఎంపీలు మాత్రం అవేవీ ఆలోచించకుండా వారి దగ్గరకు వచ్చిన పేషెంట్లకు ఇంజక్షన్లు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తూ ఒక ఇంజక్షన్‌కు రూ.100, ఒక ఫ్లూయిడ్‌కు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. క్లినిక్‌కు వచ్చిన పేషెంట్‌కు రెండు రోజులు వీరే చికిత్స చేస్తున్నారు. అనంతరం తగ్గలేదు పెద్ద హాస్పిటల్‌కు వెళ్లండి. తెలిసిన హాస్పిటల్ ఉంది అంత నేనే చూసుకుంటా అని చెప్పి రోగులను మభ్యపెట్టి ప్రైవేట్ ఆసుపత్రి రిఫర్ చేస్తున్నారు. అక్కడికి వెళ్లిన అనంతరం పేషెంట్ అడ్మిట్ అయ్యి డిశ్చార్జ్ అయ్యే వరకు అయిన హాస్పిటల్, ల్యాబ్, స్కానింగ్ బిల్లులో 25 – 40% చొప్పున డాక్టర్ వద్ద నుంచి దండుకుంటున్నారు.

తీరని ట్రాఫిక్ కష్టాలు



పచ్చికాపల్లంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

వెదురుకుప్పం: వాహన రాకపోకలు రోజురోజుకీ పెరుగుతున్నా అధికారుల్లో మార్పు కన్పించలేదు. ఇరుకు రోడ్లతో నిత్యం ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇవ్వాలంటే వాహన చోదకులు సాహసం చేయాల్సిందే. రోడ్డుకిరువైపులా పంట పొలాలు లేకుంటే వాగులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెదురుకుప్పం మండలంలో ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతంగా మారింది. ప్రధానంగా వెదురుకుప్పం నుంచి పచ్చికాపల్లం మీదుగా కార్వేటినగరం, వెదురుకుప్పం నుంచి దేవళంపేట మీదుగా కొత్తపల్లె మిట్ట వరకు సింగిల్ రోడ్డు ఉంది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగుతున్నాయి. ఆర్టీసీ బస్సులతో పాటు గ్రానైట్ రాళ్ల తరలించే వాహనాలు ప్రైవేటు వాహనాలు నిత్యం వస్తుంటాయి. వీటికి తోడు వందల సంఖ్యలో షేర్ ఆటోలు ఇబ్బడిముబ్బడిగా తిరుగుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుండడంతో ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రధాన రోడ్లకు ఇరువైపులా కోసుకుపోయి వాగును తలపిస్తున్నాయి. దీంతో పక్కకు వైదొలగాలంటే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా వెదురుకుప్పం, పచ్చికాపల్లం, పాతగుంట ప్రాంతాల్లో ఆటోలను రోడ్లపైనే పార్కింగ్ చేయడం ప్రధాన సమస్యగా మారింది

సంత రోజుల్లో జఠిలం

మండలంలో అనేక చోట్ల రోడ్ల పైనే వారపు సంతలు జరుగుతున్నాయి. ప్రధానంగా చవటగుంట, పచ్చికాపల్లం ప్రాంతాలతోపాటు మొరవ, దేవళంపేట గ్రామాల్లో సంతలు జరుగుతున్నాయి. చవటగుంటలో మంగళవారం, పచ్చికాపల్లంలో ఆదివారం సంత జరిగే సమయాల్లో రోడ్లపైనే వాపారాలు సాగిస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఏ సమయంలో ఏ వాహనం వెనక నుంచి వచ్చి ఢీకొడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. పచ్చికాపల్లంలో మూడు రోడ్ల కూడలిలో ఏ మూల నుంచి ఏ వాహనం దూసుకుపోతుందో తెలియక స్థానికులు అవస్థలు పడుతున్నారు. పచ్చికాపల్లం మీదుగా హెవీ వాహనాలు(టిప్పర్లు) కంకర, డస్ట్‌తో వెళ్తుంటాయి. పెద్ద వాహనాలు వస్తే పక్కకు వైదొలగలేక పోతున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాలు నిలిచిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో అయితే 108 వాహనానికి కూడా దారి ఇవ్వక సతమతమవుతున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం





హోమ కలశాలతో వేదపండితులు, విమాన గోపుర పూజలు చేస్తున్న పండితులు



అయ్యప్పస్వామికి మహాభిషేకం

పుత్తూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ జీర్ణోద్ధరణ అష్టబంధన మహాకుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం 5.30 గంటలకు విఘ్నేశ్వరపూజ, యజమాన సంకల్పం, పుణ్యాహవచనం, చతుర్ధకాల అవబృదహోమం యాగశాల పూజాహోమం కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 7 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించారు. 8 గంటలకు స్వామివారి గోపుర విమాన కుంభాభిషేకం, పరివార దేవతలు, శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి మహాకుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. 9 గంటలకు స్వామివారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో మహాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. రాత్రి 7 గంటలకు అయ్యప్ప ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణాసంచా నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అడుగడుగునా స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. దీంతో గత నాలుగు రోజులుగా కన్నుల పండువగా జరిగిన మహాకుంభాభిషేక వేడుకలు పరిసమాప్తమయ్యాయి.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్



అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పెనుమూరు(కార్వేటినగరం): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎగువ పూనేపల్లె గ్రామంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అభినందించేలా భారత రాజ్యాంగాన్ని రాసిన బడుగుల ఆశా జ్యోతి అంబేడ్కర్ అందరివాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో విశ్రాంతి డీజీపీ సునీల్ కుమార్, విశ్రాంతి ఎస్పీ స్వామి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయకుడి నిమజ్జనం





నిమజ్జనానికి వెళ్లుతున్న వినాయక విగ్రహాలు, వినాయకుడి ఊరేగింపు

కార్వేటినగరం: వినాయ చవితి వేడుకల్లో భాగంగా 9వ రోజు ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని యువకులు కోలాహలంగా నిర్వహించారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరం పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలకు పూజలు నిర్వహించి, ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగింపు చేపట్టారు. గ్రామ వీధుల్లో ఊరేగుతున్న వినాయ విగ్రహాలకు భక్తులు హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గాండ్లమిట్ట కూడలి, శివాలయం వీధి, తూర్పువీధి, చిన్ననగర్ వీధి, బీసీ కాలనీ, కార్వేటినగరం పెద్ద దళితవాడ, చిన్న దళితవాడల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల ఊరేగింపును తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం విశేషం. అదే విధంగా వినాయక నిమజ్జనంలో భాగంగా యువత కోలాహలంగా ఉట్లోత్సవం నిర్వహించారు.

నింద్రలో..

నింద్ర: మండలంలో ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్రలోని వినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు. అదే విధంగా తోటవీధిలోని వినాయక విగ్రహన్ని కూడా నిమజ్జనం చేశారు.

సర్పంచ్‌పై దాడికి యత్నం

గంగాధరనెల్లూరు: మండలంలోని బాలగంగానపల్లి గ్రామంలో కొందరు కూటమి ప్రభుత్వానికి చెందిన నేతలు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామ సర్పంచ్, స్థానికులు తెలిపారు. తవ్వకాలు చేపడుతున్న వారిని సర్పంచ్, మరికొందరు నేతలు స్థానికులతో కలిసి వెళ్లి ప్రశ్నించగా తమపై దాడికి దిగారని తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమపైనే ఫిర్యాదు చేసి తమకు చెందిన కొందరిని పోలీస్ స్టేషన్ తీసుకు వెళ్లారని ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్ వద్ద ఉంచుకొని కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

పుత్తూరు: నలబయ్యేళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు అందరూ మళ్లీ అదే పాఠశాలలో కలిసి సందడి చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాల పరిసరాలు పూర్వ విద్యార్థుల సందడితో కళకళలాడింది. 1983–84 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకొన్న పూర్వ విద్యార్థులు సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ, ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కేశవరెడ్డి, నిర్మలా జయకుమారిలను గజ మాలలతో ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఎంఈఓ కేశవరెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. నలభయ్యేళ్ల తర్వాత విద్యార్థులు తమని ఆహ్వానించి, సత్కరించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరకలేసిన ఉత్సాహం

- పూలవారికండ్రిగలో జల్లికట్టు జోష్



కోడె గిత్తలను కట్టడి చేస్తున్న యువకులు




జనసందోహం

వెదురుకుప్పం: ఉత్సాహం ఉరకలేసింది... రంకెలేసిన కోడె గిత్తలు... జనసమూహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయిన పోట్ల గిత్తలు పౌరుషాన్ని చూపించాయి. ఎడ్ల వేగాన్ని నియంత్రించలేక యువత ప్రేక్షకపాత్ర వహించారు. మండలంలోని కొమరగుంట పంచాయతీ పూలవారి కండ్రిగ గ్రామంలో ఆదివారం జరిగిన జల్లికట్టు యువతలో జోష్ తెచ్చింది. కాలుదువ్విన కోడె గిత్తలు, యువత కేరింతలు మధ్య జరిగిన జల్లికట్టు దుమ్ము రేపింది. యువత ఆధ్వర్యంలో జరిగిన ఎడ్ల పందాలు అలరించాయి. ఎడ్ల పందాల నిర్వహణకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఎడ్లకు పలకలు, వస్త్రాలతోపాటు బెలూన్‌లు కట్టి పందానికి సిద్ధం చేశారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు అక్కడికి చేరుకున్నారు. పలకల కోసం అల్లి వద్ద సిద్ధంగా యువత నిలబడడంతో నిర్వాహకులు ఎడ్లను పందానికి ఉసిగొల్పారు. దీంతో రంకెలేస్తూ దూసుకుపోతున్న ఎడ్లను యువత కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. ఎడ్ల వేగాన్ని నిలువరించలేక చేతులెత్తేశారు. ఎద్దులను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీలు పడ్డారు. కొందరు ఎడ్ల వేగాన్ని నిలువరించేందుకు సాహసం చేశారు. ఉత్సాహంతో పందెంలో పాల్గొన్న యువత పరుగులు తీస్తున్న కోడె గిత్తలను కట్టడి చేసి పలకలను లాక్కొన్నారు. పలకలు పట్టిన యువత తమ విజయ దరహాసంతో చిందులు వేశారు. అయితే కొన్ని ఎడ్లు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా యువతకు చిక్కకుండా పరుగులు తీశాయి. పశువుల దూకుడును నిలువరించలేక యువకులు నిరుత్సాహపడ్డారు. ఎడ్ల పందాలు కోలాహలంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం జనంతో కిక్కిరిసింది.







దూసుకుపోతున్న కోడె గిత్తలు